క్లుప్తంగా

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తులు

యానాం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 2023–24 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బుధవారం ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు తెలిపారు. దీనికి సంబంధించి డబ్ల్యూ డబ్ల్యూ.నవోదయ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 2 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు ఫారాలు యానాంలోని ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలల్లో లభ్యమవుతాయన్నారు. దరఖాస్తుదారులు 2022–23 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతూ ఉండాలన్నారు. ఈ నెల 31వ తేదీ దరఖాస్తులకు చివరి తేదీ అన్నారు.

టెంట్ హౌస్ యూనియన్ అధ్యక్షుడిగా గురుప్రసాద్


గురుప్రసాద్‌ను సత్కరిస్తున్న వ్యాపారులు


అమలాపురం టౌన్: స్థానిక సత్యనారాయణ గార్డెన్స్‌లో జిల్లా టెంట్ హౌస్ యూనియన్ సమావేశం యూనియన్ ప్రతినిధి జి.గీతా రామం అధ్యక్షతన బుధవారం జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు నూతన అధ్యక్షుడిగా రాకుర్తి గురుప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన్ని యూనియన్ నాయకులు సత్కరించారు. జిల్లాలో టెంట్ హౌస్ వ్యాపారుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని గురుప్రసాద్ అన్నారు. జిల్లాకు చెందిన టెంట్ హౌస్ వ్యాపారులు కొప్పిశెట్టి నాగేశ్వరరావు, జి.కనకరాజు, రాజు, ముచ్చెర్ల బాబి, అర్లపల్లి ముత్యం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. గురుప్రసాద్‌ను పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ తదితర వ్యాపార సంఘాల ప్రతినిధులు అభినందించారు.

వైభవంగా లక్ష తులసి పూజ


ధనుర్మాస లక్ష తులసి పూజ చేస్తున్న పండితులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస లక్ష తులసి పూజను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పెద్దింటి వెంకట సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా క్రతువులో గోపూజ, హోమం, సుందర కాండ పారాయణం, శాంతి కల్యాణం, దీపాలంకరణ, పూర్ణాహుతి కనుల పండువగా సాగాయి. ఈ పూజల్లో రాష్ట్ర దేవ తిలకుల, గాండ్ల తిలకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిస భవాని ప్రియ, రాష్ట్ర సంఘం అధ్యక్షుడు అడ్డా వీర వెంకటరాజు, ప్రధాన కార్యదర్శి కాశిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీశైలం సత్రం ద్వారా రావులపాలెం దేవ తిలకుల సంఘం ఇరువురి విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను బహూకరించింది. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి, వైఎస్సార్ సీపీ పట్టణ యువజన అధ్యక్షుడు దూడల ఫణి తదితరులు పాల్గొన్నారు.

వృత్తిలో ఏకాగ్రత అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

ముమ్మిడివరం: వృత్తి పట్ల ఉపాధ్యాయులకు ఏకాగ్రత అవసరమని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో బుధవారం యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక జరిగింది. మండల శాఖ అధ్యక్షుడు కేవీఎస్ నారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్సీ ఐవీ హాజరై మాట్లాడారు. విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులు, ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అనంతరం గౌరవాధ్యక్షుడిగా పి.ఆనందరావు, అధ్యక్షుడిగా కేవీఎస్ నారాయణ, సహాయ అధ్యక్షుడిగా జీవీవీఎస్ఎన్ మూర్తి, సహాధ్యక్షురాలుగా బీఎస్‌వీఎం గణేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా యు.దశరథరామయ్య, కోశాధికారిగా జేసీహెచ్ భైరవస్వామి, ఎఫ్‌డబ్ల్యూఎస్ కార్యదర్శి బి.శివగణేష్, మహిళా కార్యదర్శిగా కె.రామలక్ష్మి, ఆరుగురు కార్యవర్గ సభ్యులు, మరో 8 మంది జిల్లా కౌన్సిలర్లుగా ఎంపికయ్యారు.

టీడీపీ నేతల నిరసన

ఉప్పలగుప్తం: టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటనను కుప్పం నియోజకవర్గంలో పోలీసులు అడ్డుకున్నారంటూ గొల్లవిల్లిలో ఆ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. మోటారు సైకిళ్లతో ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, మండల పార్టీ అధ్యక్షుడు అరిగెల నానాజీ తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా పించన్ల సొమ్ము పెంపు

- వచ్చే ఏడాది జనవరి నుంచి రూ.3 వేలు
- మంత్రి పినిపే విశ్వరూప్ వెల్లడి


జెండా ఊపి బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్


గొల్లవిల్లి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

అల్లవరం: గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్ పింఛన్ల సొమ్మును దశల వారీగా పెంచుతున్నారని, ప్రస్తుతం రూ.2,750 అందిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. బుధవారం గుడ్డివానిచింత వద్ద సత్యకస్తూరి ఫంక్షన్ హాల్లో బుధవారం ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన నిర్వహించిన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 64 లక్షల పింఛన్లు పంపిణీ చేసి చరిత్ర సృష్టించారన్నారు. రెండు సార్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు కేవలం 39 లక్షల పింఛన్లు మాత్రమే అందించారన్నారు. పథకాలు అమలు చేస్తామని ప్రకటనలే తప్ప ఏ పథకం పూర్తి స్థాయిలో చంద్రబాబు అమలు చేయలేకపోయారని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీలో 39 లక్షల నుంచి 64 లక్షల పింఛన్ల లబ్ధిదారులను పెంచి ప్రతి నెలా 1న ఇంటికే సొమ్ము చేరవేస్తున్నామన్నారు. వచ్చే ఏడాది జనవరి నుంచి పింఛన్ సొమ్ము రూ. 3 వేల చొప్పున అందజేస్తామని మంత్రి అన్నారు. అమలాపురం నియోజకవర్గానికి 3 వేల కొత్త పింఛన్ల మంజూరు చేశామన్నారు. అనంతరం లబ్ధిదారులకు మంత్రి విశ్వరూప్ చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఏఎంసీ వైస్ చైర్మన్ తుట్టిపు బాబి, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకటరావు, సర్పంచులు బొమ్మి బాలవేణి, రొక్కాల విజయలక్ష్మి, రాకావు విజయలక్ష్మి, దాకారపు చిరంజీవిరావు, కదలి గంగాచలం, వడ్డి సుభాషిణి, బద్రే సీతారత్నం, తిక్కిరెడ్డి శ్రీనివాసరావు, సుందరనీడి సాయి, కొల్లు వెంకటరమణ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి

కొత్తగా నియమించిన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సమన్వయంతో పని చేయాలని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీ అధ్యక్షతన కన్వీనర్లు, వలంటీర్లతో గుడ్డివానిచింత వద్ద జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. నవరత్న పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్ల కృషి అభినందనీయమన్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలందించారని తెలిపారు. వలంటీర్లతో పాటు కన్వీనర్లు, గృహ సారథులు నిత్యం సంక్షేమ పథకాలపై పర్యవేక్షిస్తారన్నారు. ఎన్నికల సమయంలో గృహ సారథులు కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, మాజీ రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీను, బొమ్మి ఇజ్రాయిల్, జిల్లా సంయుక్త కార్యదర్శి మెరికల శ్రీను, బీసీ సెల్ అధ్యక్షుడు యల్లమిల్లి బోసు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పరమట శ్రీను పాల్గొన్నారు.

తాడికోనకు బస్సు సర్వీసు ప్రారంభం

అమలాపురం నుంచి తాడికోన గ్రామానికి నూతన బస్సు సర్వీసును మంత్రి విశ్వరూప్ ప్రారంభించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్‌ను గ్రామస్తులు అభ్యర్థించిన నేపథ్యంలో బస్సు సర్వీసు గురించి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి మంజూరు చేయించారు. సర్పంచ్ సాధనాల వెంకట సూర్యనాగమణి, ఉండ్రు బేబి ధనలక్ష్మి, ఉండ్రు వెంకటేశ్వరరావు, గ్రామకమిటీ అధ్యక్షుడు శిరంగు వీరబాబు పాల్గొన్నారు.

పారదర్శకంగా పథకాల అమలు

ఉప్పలగుప్తం: సచివాలయ వ్యవస్థతో పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. గొల్లవిల్లిలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి ఆధ్వర్యంలో గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లకు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ మండల వ్యాప్తంగా పనిచేస్తున్న 338 మంది వలంటీర్లతో పాటు 17 సచివాలయాలకు 51 మంది కన్వీనర్లను నియమించామని తెలిపారు. కొత్తగా నియమితులైన కన్వీనర్లు ప్రజలకు అందుతున్న పథకాలను పరిశీలించాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిశోర్, ఉద్యాన బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, వ్యవసాయ మండలి జిల్లా చైర్మన్ మోటూరి సాయి, మండల చైర్మన్ మానే శ్రీను, రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీను, సర్పంచులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలే లక్ష్యం

- ఏ ఒక్కరి పింఛను తొలగించం
- ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్


ముమ్మిడివరం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్


కాట్రేనికోనలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

ముమ్మిడివరం: అర్హులందరికీ పింఛన్లు అందిస్తామని, ఏఒక్కరికీ అన్యాయం జరగదని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. ముమ్మిడివరం రూరల్, నగర పంచాయతీలో కొత్తగా మంజూరైన 346 మంది లబ్ధిదారులకు ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. అర్హులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందించాలనే ఉద్దేశంతో పలువురికి నోటీసులు ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నిజమైన లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పథకాలు చిత్తశుద్ధితో అందించినప్పుడే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని నమ్మిన వ్యక్తి సీఎం జగన్ అని అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని ఎత్తుగడలు వేసినా రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని.. మళ్లీ జగన్ సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సుమారు 30 సంక్షేమ పథకాలతో పేదరికం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలని సీఎం జగన్ చూస్తున్నారన్నారు. నాయకులు కుడిపూడి శివశంకరరావు, కోలా బాబ్జీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, వేగిరౌతు రాజబాబు, మండల పార్టీ కన్వీనర్ జగతాపద్మనాభం (బాబ్జీ), వైస్ చైర్మన్ వేటుకూరి బోసురాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ వెలుగులు

కాట్రేనికోన: సీఎం జగన్‌తో రాష్ట్రానికి సంక్షేమ వెలుగులు వచ్చాయని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. కాట్రేనికోన మార్కెటింగ్ యార్డు వద్ద మండల పార్టీ కన్వీనర్ నల్లా నరసింహమూర్తి అధ్యక్షతన కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. మండలానికి 423 కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. వీటిని లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ల సొమ్మును రూ.2,750కు పెంచారన్నారు. లబ్ధిదారులకు ప్రతి నెలా 1న వలంటీర్లు ఇంటికెళ్లి మరీ పథకాల సొమ్మును అందజేస్తున్నారన్నారు. జెడ్పీటీసీ నేల కిశోర్‌కుమార్, నాయకులు నడింపల్లి సూరిబాబు, పాలెపు ధర్మారావు, ఏడిది సుబ్బు, సంసాని నాగేశ్వరరావు, గంటి వెంకట సుధాకర్, నల్లా బేబి జానకి, మోకా చంద్ర నాగరత్నం తదితరులు ఉన్నారు.

కోడిపందేల స్థావరాల తొలగింపు


సుంకరపాలెంలోని ప్రైవేట్ స్థలంలో టెంట్లు తొలగిస్తున్న సిబ్బంది

తాళ్లరేవు: సుంకరపాలెంలో కోడిపందేల నిర్వహణకు పలువురు చేస్తున్న ఏర్పాట్లను పోలీసులు అడ్డుకున్నారు. ఆ పంచాయతీ పరిధి జాతీయ రహదారి 216 చెంతన ఓ ప్రైవేట్ లేఅవుట్‌లో పందేల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఆ సమీప గ్రామాల ప్రజలు అభ్యంతరాలు తెలియజేస్తూ కోడిపందేలు నిర్వహిస్తే సహించమని హెచ్చరించారు. దీనిపై స్పందించిన కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు, కోరంగి ఎస్సై శ్రీనివాస కుమార్ ఆ ప్రాంతాన్ని సందర్శించి తక్షణమే తొలగించాలని ఆదేశించారు. పోటీల నిర్వహణకు వేసిన టెంట్లు తదితర సామగ్రిని తొలగించారు. సంక్రాంతి ముసుగులో పేకాట, జూదం, కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని సీఐ శ్రీనివాసు అన్నారు.

కళలకు జీవం.. కళాకారులకు ప్రోత్సాహం

- అభ్యుదయ సాహిత్య వేదిక పీటీఎం ట్రస్టు
- నేడు 15 వసంతాల వేడుక



బెంగళూరు కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన పుల్లెపు వెంకటేశ్వరరావు (ఫైల్)

ముమ్మిడివరం: కళలకు జీవం పోస్తూ.. కళాకారులను ప్రోత్సహిస్తూ ఐ.పోలవరంలోని పుల్లెల తాతయ్య మెమోరియల్ అసోసియేషన్ ట్రస్ట్ (ప్రజా కళల ప్రోత్సాహక వేదిక) అనే పీటీఎం సంస్థ ముందుకు సాగుతోంది. పదిహేను వసంతాలు పూర్తి చేసుకుని 16వ వసంతంలోకి అడుగు పెడుతోంది. ఐ.పోలవరం వేదికగా ఈ సంస్థ ద్వారా 9 ప్రాజెక్టులను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల మన్ననలను పొందుతోంది. గురువారం నుంచి వార్షికోత్సవ వేడుకలు జరుపుకొంటుంది. ఈ సందర్భంగా ఔత్సాహిక కవులకు అవార్డుల ప్రదానం, సాహితీ సరాగాలు, గానవిభావరి, ఆత్మీయ సత్కారాలు, స్మారక ప్రసంగాలు, గోదావరి గుబాళింపులు– కవి సమ్మేళనం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యా సాంస్కృతిక ఉద్యమ ప్రముఖులు, వైద్య నిపుణులకు ఈ సంస్థ ఏటా పురస్కారాలు అందిస్తోంది. చరిత్రలో మరుగున పడుతున్న మహనీయుల జయంతిలు, వర్ధంతులను జరుపుతోంది.

పొందిన పురస్కారాలు

సంస్థ వ్యవస్థాపకుడు పుల్లెపు వెంకటేశ్వరరావు నాలుగు దశాబ్దాలుగా సాహితీ సేవలందిస్తున్నారు. ఈ సేవలకు గాను తెలుగు యూనివర్సిటీ, భారతీయ దళిత సాహిత్య అకాడమీ, హెల్త్ కేర్ ఇంటర్నేషనల్, గ్లోబల్ ఫౌండేషన్‌తో పాటు పలు సంస్థల నుంచి ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్నారు. అలాగే హ్యూమనిస్టు లైబ్రరీ డైరెక్టర్‌గా ఉన్న వెంకటేశ్వరరావు సతీమణి సూర్యావతి 2014లో హైదరాబాద్‌కు చెందిన మదర్ థెరిసా ట్రూ ఇండియా అవార్డు అందుకున్నారు. గత ఏడాది జూలై 30న బెంగళూరుకు చెందిన ఆసియా కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి పుల్లెపు వెంకటేశ్వరరావు డాక్టరేట్ పొందారు.

ఆనందంగా ఉంది..



పీటీఎం సంస్థ ద్వారా రఘుపతి వెంకటరత్నం నాయుడు జాతీయ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న వారిని పురస్కారాలతో సత్కరించడం అభినందనీయం. సంస్థ వ్యవస్థాపకుడు పీవీఆర్‌కు ప్రత్యేక అభినందనలు.

– వీధి సురేష్‌బాబు, హెచ్‌ఎం, అవార్డు గ్రహీత

సేవలు మరింత విస్తృతం



కవులు, కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా 15 ఏళ్ల కిందట పీటీఎం సంస్థ ఏర్పడింది. ఇప్పటి వరకూ వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన 4,006 మందికి అవార్డులు అందించాం. అలాగే కవి రాజు త్రిపురనేని సాహిత్య వేదిక(కత్రిసా) ద్వారా 1,005 మందికి, ప్రజ్ఞా సాహితీ వేదిక నుంచి వెయ్యి మందికి అవార్డులు అందించాం. సంస్థ సేవలను విస్తృతం చేస్తాం.

– పుల్లెపు వెంకటేశ్వరరావు, పీటీఎం వ్యవస్థాపకుడు, ఐ.పోలవరం

ప్రత్యేక కృతజ్ఞతలు



కవులు, మాలాంటి కళాకారులను ప్రోత్సహిస్తున్న పీటీఎంకు ప్రత్యేక అభినందనలు. నృత్య కళాకారిణి శోభానాయుడు పేరుపై అవార్డు అందుకోవడం సంతోషంగా ఉంది. కూచిపూడి నాట్యంలో ప్రతిభను గుర్తించి సత్కరిస్తున్న సంస్థ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– కుమారి పావని, కూచిపూడి నృత్య కళాకారిణి

నేడు వెంకన్నకు లక్షతులసి పూజ

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామికి ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే లక్షతులసి పూజను గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ లక్షతులసి పూజలో పెద్ద ఎత్తున మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ ఆధ్వర్యంలో స్వామికి పూజ నిర్వహిస్తారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన చేపట్టనున్నట్లు తెలిపారు.

డిమాండ్లు నెరవేర్చకుంటే అడ్డుకుంటాం

- నేటి నుంచి ప్రజా సమస్యలపై దీక్ష
- ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్


ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్

యానాం: పుదుచ్చేరి సీఎం రంగసామి యానాంలో సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతూ గురువారం నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని, దీనికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. బుధవారం స్థానికంగా ఆయన కార్యాలయం వద్ద అభిమానులు, కార్యకర్తలు, మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. యానాం ప్రజలకు సంబంధించిన డిమాండ్లను నెరవేర్చే వరకూ పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదన్నారు. ముఖ్యంగా సీఎం ఈ ప్రాంతంపై వివక్ష ప్రదర్శిస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజా ఉత్సవాల ముగింపు సభకు యానాంకు సీఎం రంగసామి వస్తే అడ్డుకుంటామని చెప్పారు. పెద్ద మనసుతో రంగసామి డిమాండ్లను నెరవేరిస్తే పూలమాలలతో ఊరేగిస్తామని లేదంటే రానివ్వమని స్పష్టం చేశారు. ప్రజలు, కార్యకర్తల కోసం ప్రాణాలను సైతం అర్పించడానికి వెనుకాడనన్నారు. ఒక వ్యక్తి వ్యక్తిగత స్వార్థంతో రీజెన్సీ ఫ్యాక్టరీ మూసివేతతో స్థానిక నిరుద్యోగులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. 25 ఏళ్ల పాటు పాలించిన నాయకుడు ప్రస్తుతం కక్ష పూరిత రాజకీయాలు చేస్తూ ఆఖరికి యానాం ప్రజలను ఇబ్బంది పాల్జేస్తున్నాడని ఆరోపించారు. మత్స్యకారులకు వచ్చే ఓఎన్జీసీ పరిహారం సైతం పక్కదోవ పట్టించారని విమర్శించారు. నాయకులు పండు సిద్దార్థకుమార్, కాటంశెట్టి రామ్మూర్తి, మోదే హరిశ్చంద్ర, మంగా సత్యనారాయణ, చెక్కల అరుణ్‌కుమార్, నక్కల సుబ్బన్న, కాకి నాగేశ్వరరావు, మచ్చా శ్రీను, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తడిపొడి విధానంతో చీడపీడల నివారణ

అంబాజీపేట: వరి పంటలో తడి పొడి సాగు చేయడం వల్ల మిథేన్ విషవాయువును నియంత్రించడమే కాకుండా పర్యావరణానికి హాని కలగకుండా చేయవచ్చని ప్రొఫెసర్ నరసింహారెడ్డి రైతులకు వివరించారు. పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో హైదరాబాద్ కోర్ కార్బన్‌ఎక్స్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ సహకారంతో వ్యాఘ్రేశ్వర ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో తడి పొడి వరి సాగు విధానంపై బుధవారం అవగాహన కల్పించారు. తడిపొడి విధానంతో చీడపీడల నుంచి పంటలను కాపాడుకోవచ్చన్నారు. అందుకుగాను ఎకరాకు ఏడాదికి రూ.800 ప్రోత్సాహకాన్ని ఇవ్వనున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీలు కుసుమ వెంకటేష్, పబ్బినీడి రాంబాబు, ఉపసర్పంచ్ వీర రవి తదితరులు పాల్గొన్నారు.

కుమార్‌రాజాకు డాక్టరేట్

రాజోలు: ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన హిందీ అధ్యాపకుడు పాలపర్తి కుమార్‌రాజా ఆంధ్రా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను అందుకున్నారు. 'హిందీ దళిత్ ఆత్మ కథా అభివ్యక్త్ వ్యక్తిత్వ వికాస్' అనే వ్యాసానికి ఆంధ్ర విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య పీజీడీ ప్రసాదరెడ్డి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నట్టు కుమార్‌రాజా వివరించారు. హిందీ వ్యాసానికి డాక్టరేట్ అందుకున్న కుమార్‌రాజాను డీవీఓ ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి అభినందించారు.

చేనేత ఐక్య వేదిక అధ్యక్షుడిగా జయనాథ్



అమలాపురం టౌన్: రాష్ట్ర చేనేత ఐక్య వేదిక జిల్లా శాఖ అధ్యక్షుడిగా అమలాపురం పట్టణానికి చెందిన కాశిన జయనాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నీలూరి రుషింగప్ప నియామక ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని పట్టణాలు, మండలాలు, గ్రామ కమిటీలకు త్వరలోనే చేనేత ఐక్య వేదిక కార్యవర్గాలను నియమించి బలోపేతం చేస్తానని జయనాథ్ తెలిపారు.

పరిశోధన సంస్థ సభ్యుడిగా అరుణ్‌కుమార్



అమలాపురం టౌన్: గ్లోబల్ లీడర్ ఫౌండేషన్ (జీఎఫ్ఎల్) ఏర్పాటు చేసిన పరిశోధన సంస్థ సభ్యుడిగా స్థానిక యేడిద సత్యనారాయణ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంగళపల్లి అరుణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ నియామక పత్రాన్ని జీఎఫ్ఎల్ చైర్మన్ రమేష్ త్రిపాఠి ప్రిన్సిపాల్‌కు అందజేశారు. ఉన్నత విద్య, భవిష్యత్ అవసరాలు, ఆసియా దేశాల్లో విద్యా రంగ అభివృద్ధిపై చేసే పరిశోధనలకు మార్గదర్శకులుగా వ్యవహరిస్తారు. కోనసీమ జేఏసీ చైర్మన్ వాసా దివాకర్, కన్వీనర్ రామ్మోహనరావు, ఉపాధ్యక్షుడు మంత్రిప్రగడ వేణుగోపాల్, కారటం ప్రవీణ్ అభినందించారు.

డాక్టర్ మెట్ల ఘాట్ ప్రారంభం


డాక్టర్ మెట్ల ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి విశ్వరూప్, వైఎస్సార్ సీపీ, టీడీపీ నాయకులు

అమలాపురం టౌన్: స్థానిక అబ్బిరెడ్డి కాలనీ వద్ద జాతీయ రహదారి చెంత నిర్మించిన మాజీ మంత్రి దివంగత డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఘాట్‌ను టీడీపీ నేతలు బుధవారం ప్రారంభించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, వైఎస్సార్ సీపీ నాయకులు దివంగత డాక్టర్ మెట్ల ఘాట్‌ను సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఘాట్ ప్రారంభ కార్యక్రమంలో మాజీ మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, గొల్లపల్లి సూర్యారావు, శాసన మండలి మాజీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గంటి హరీష్ మాధూర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

6న కర్నూలులో అథ్లెటిక్స్ లీగ్

అమలాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి రెండో దశ అథ్లెటిక్స్ శాప్ లీగ్ పోటీలు ఈ నెల 6న కర్నూలులో జరుగుతాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు సురేష్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 100, 400, 1500 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, షాట్‌పుట్ పోటీలు జరుగుతాయన్నారు. పురుషులు, మహిళా విభాగాల్లో ఓపెన్ కేటగిరీలో జరిగే పోటీలకు రూ.200 ఎంట్రీ ఫీజుగా నిర్ణయించారన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యాలను కర్నూలు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఏర్పాటు చేస్తుందన్నారు. క్రీడాకారులు కోనసీమ జిల్లా అథ్లెటిక్ క్రీడాకారులు రవితేజ, సెల్ 95337 59114 నంబరులో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

బస్సును ఢీకొన్న వ్యాన్


ప్రమాద స్థలంలో వాహనాలు

ముమ్మిడివరం: అమలాపురం నుంచి కాకినాడ వెళుతున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొంది. ముమ్మిడివరం మండలం పల్లిపాలెం వద్ద బుధవారం ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. బస్సు, వ్యాన్ ముందు భాగాలు నుజ్జయ్యాయి. ఈ మేరకు ఎస్సై కె.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంధుల జీవితాల్లో వెలుగులు


బ్రెయిలీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దివ్యాంగ విద్యార్థులు

యానాం: బ్రెయిలీ లిపిని కనుగొని అంధుల జీవితాల్లో అక్షర వెలుగులు నింపిన లూయిస్ బ్రెయిలీ చిరస్మరణీయులని పలువురు అన్నారు. బుధవారం స్థానిక ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ, మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మానసిక దివ్యాంగ విద్యార్థుల మధ్య బ్రెయిలీ జయంతి నిర్వహించారు. ప్రత్యేక ఉపాధ్యాయులు యు.సుశీల, లావణ్య, మహేశ్వరి, వీరవేణి, తాతారావు, నూకరత్నం, విజయలక్ష్మి, పవన్, గీత పాల్గొన్నారు.

ఆర్థిక అభివృద్ధి సాధించాలి


మహిళలకు కోళ్లు అందిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శంకర్‌ప్రసాద్ తదితరులు

అమలాపురం రూరల్: మహిళలు పెరటి కోళ్ల పెంచుకుని, ఆర్థిక అభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్ అన్నారు. బుధవారం మహిళలకు పెరటి కోళ్ల పెంపకంపై అమలాపురంలోని మండల మహిళ సమాఖ్య కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలో పలు గ్రామాలకు చెందిన మహిళలకు పెరటి కోళ్లు పంపిణీ చేశారు. పెంపకానికి అవసరమైన దాణా, సామాన్లు అందజేశారు. డీపీఎం విజయకుమార్, ఏపీఎం రమణ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి చిత్రపటంతో ముద్రించిన క్యాలెండర్‌లను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ బుధవారం ఆవిష్కరించారు. సీఎం జగన్‌పై ఉన్న అభిమానంతో విలసవిల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్ ఈ క్యాలెండర్‌లను ముద్రించారు. మంత్రి విశ్వరూప్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. వాటిని పార్టీ నాయకులకు పంచారు.

జూదరుల అరెస్టు

ముమ్మిడివరం: అనాతవరం శివారు మునుకోటిపాలెంలోని ఓ ఇంట్లో మంగళవారం రాత్రి పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.35 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై కె.సురేష్‌బాబు తెలిపారు.